స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలి

అడ్డగుట్ట, జూలై 25 : వికలాంగులను అవమానపర్చిన ఐఏఎస్ స్మితా సబర్వాల్‌ను తక్షణమే డిస్మిస్ చేయాలని అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం వారు తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పులిపాటి శ్రీనివాస్, జంగిల్ శ్రీనివాస్, తాళ్ల మాధవి, డేవిడ్, మహేందర్, లావణ్య, శైలజా, రాములు పాల్గొన్నారు.

అంతర్జాతీయ క్రీడా సదస్సుకు ఓయూ ప్రొ.రాజేశ్‌కుమార్

హైదరాబాద్, ఆట ప్రతినిధి, జూలై 25 : మలేషియా ఈనెల 26 నుంచి 28వ తేదీల్లో జరగనున్న విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ క్రీడా అభ్యున్నతి శాంతి సమరసియాలపై, శారీరక విద్యారంగం సదస్సుకు ఉస్మానియా యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజేశ్‌కుమార్ ముఖ్య స్పీకర్‌గా పాల్గొని శారీరక విద్యా రంగం, క్రీడ విజ్ఞాన శాస్త్రం, అథ్లెటిక్స్ క్రీడా అభ్యున్నతిపై ప్రసంగించనున్నారు. రాజేశ్‌కుమార్ గతంలోనూ ఓయూ ప్రతినిధిగా యూకే, లండన్, జపాన్, చైనా, వియత్నాం, ఇండోనేషియా, టర్కీ, థాయిలాండ్, ఫిలిప్పీన్స్, మలేషియా, బహ్రెయిన్, శ్రీలంక, టర్కీ, మొరిషియస్‌లలో అంతర్జాతీయ శారీరక విద్య, అథ్లెటిక్స్ క్రీడా అభ్యున్నతి సదస్సుల్లో పాల్గొని మాట్లాడారు. నాలుగు దశాబ్దాల నుంచి నిజాం కళాశాల, లాల్‌బహదూర్ స్టేడియంలో శిక్షణ ఇస్తూ అనేక మంది క్రీడాకారులను ఆయన తయారు చేశారు. హైదరాబాద్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జాతీయ, అంతర్జాతీయ స్థాయి చాంపియన్‌షిప్‌లో తెలంగాణ క్రీడ యువ కిశోరాలకు శిక్షణనిచ్చి సహాయాన్ని సహకారాన్ని అందజేస్తూ క్రీడాకారులుగా తయారు చేస్తున్నారు.

గ్రేటర్‌లో మరో రెండ్రోజులు వానలు

సిటీబ్యూరో, జూలై 25(నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో గత మూడు రోజులుగా గ్రేటర్‌ను ముసురువాన ముసురుకున్నది. గురువారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా ముసురు వాన కురుస్తుండటంతో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే తక్కువకు పడిపోయాయి. రాత్రి 9గంటల వరకు అత్యధికంగా యూసుఫ్‌గూడలో 1.28సెం.మీలు, గాజులరామారంలో 1.18సెం.మీలు, లంగర్ హౌస్‌లో, ముషీరాబాద్ తాళ్లబస్తీలో 1.15సెం.మీలు, కూకట్‌పల్లి హైదర్‌నగర్‌లో1.13సెం.మీలు, ఖైరతాబాద్‌లో 1.10సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు టీజీడీపీఎస్ అధికారులు వెల్లడించారు. ఆవర్తనం కొనసాగుతుండటంతో రాగల మరో రెండు రోజులు గ్రేటర్‌లోని పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

గృహజ్యోతికే బడ్జెట్ కేటాయింపు

మరి కొత్త విద్యుత్ నెట్‌వర్క్‌ల ఏర్పాటుకు నిధులేవి..?

4 విద్యుత్ సంస్థల్లో టీజీ ఎస్‌పీడీసీఎల్‌కు దక్కేదెంతో..?

రాష్ట్ర విద్యుత్ శాఖలకు బడ్జెట్ కేటాయింపు రూ.16410 కోట్లు



సిటీబ్యూరో, జూలై 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించిన నిధులన్నీ విద్యుత్ సబ్సిడీలకే సరిపోనున్నది. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఏర్పాటు చేసే కొత్త విద్యుత్ నెట్‌వర్క్‌లకు నిధుల కోసం వెతుక్కోవాల్సిన పరిస్థితి ఉన్నది. రాష్ట్రంలోని 4 విద్యుత్ సంస్థలైన ట్రాన్స్‌కో, జెన్‌కో, టీజీఎస్‌పీడీసీఎల్, టీజీఎన్‌పీడీసీఎల్‌లకు కలిపి మొత్తం రూ.16410 కోట్లను బడ్జెట్‌లో కేటాయించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకమైన గృహజ్యోతికే ఈ నిధులన్నీ సరిపోతాయని, కొత్తగా అవసరమైన చోట విద్యుత్ నెట్‌వర్క్‌లను విస్తరించాలంటే నిధులు చాలా కీలకమని నిపుణులు పేర్కొన్నారు. గత ప్రభుత్వం విద్యుత్ రంగానికి ఎంతో ప్రాధాన్యతనిచ్చి నిరంతర నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడంతో పాటు విద్యుత్ నెట్‌వర్క్‌ను విస్తృతంగా ఏర్పాటు చేసింది. అయితే ప్రస్తుత బడ్జెట్‌లో కేటాయించిన నిధులు ఆయా సంస్థలకు ఎంత మేరకు సరిపోతాయన్నది ప్రశ్నార్థకంగా మారనున్నది.

గ్రేటర్‌లో గృహజ్యోతికి రూ.400 కోట్లు

గృహజ్యోతి పథకానికి బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం రూ.2418 కోట్లు కేటాయించింది. దీంట్లో గ్రేటర్‌లో ప్రస్తుతం 9.4లక్షల మందికి గృహజ్యోతి పథకం అమలవుతుండగా, అందుకోసం యేడాదికి సుమారు రూ.400 కోట్ల వరకు అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. డిస్కం పరిధిలోని అత్యంత కీలకమైన గ్రేటర్‌లో నాలుగు జిల్లాలు ఉన్నాయి. అందులో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, సంగారెడ్డి ఉన్నాయి. నాలుగు జిల్లాల్లో ఉన్న గృహజ్యోతి లబ్ధిదారులకు జీరో బిల్లుల కింద డిస్కంకు ప్రభుత్వం చెల్లించనున్నది. నగర శివారు ప్రాంతాలు శరవేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో విద్యుత్ నెట్‌వర్క్‌ను విస్తరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. ఇప్పటికే ప్రభుత్వం ఓఆర్‌ఆర్‌కు జీహెచ్‌ఎంసీ పరిధిని, ఆర్‌ఆర్‌ఆర్ వరకు హెచ్‌ఎండీఏ పరిధిని విస్తరిస్తామని ప్రకటించడంతో దానికి అనుగుణంగా విద్యుత్ నెట్‌వర్క్‌ను భారీ ఎత్తున ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దానికి వేల కోట్ల రూపాయల నిధుల అసవరం ఉంటుంది.

గ్రేటర్ పరిధిలో జూలై నెల గృహజ్యోతి లబ్ధిదారులు

జిల్లా	మొత్తం లబ్ధిదారులు లక్షల్లో	బిల్లులు మొత్తం కోట్లలో
హైదరాబాద్	2.28	రూ.8.9
రంగారెడ్డి	2.83	రూ.9
మేడ్చల్-మల్కాజిగిరి	2.28	రూ.9.9
సంగారెడ్డి	2.00	రూ.6.6

రాష్ట్రపతి నిలయానికి ఉచిత షటిల్ బస్సు సేవలు

వర్చువల్‌గా ప్రారంభించిన రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము

ఉచిత బస్సు సేవలు ప్రారంభిస్తున్న టీజీటీడీసీ చైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి, టీజీటీడీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.ప్రకాశ్ రెడ్డి, రాష్ట్రపతి నిలయం అధికారి రజినీ ప్రియ

బొల్లారం, జూలై 25 : బొల్లారం రాష్ట్రపతి నిలయంలో ప్రజల సందర్శనను మెరుగుపర్చడం, పౌరులకు సౌకర్యాలు పెంచడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో ఉచిత షటిల్ బస్సు సేవలు ప్రారంభిస్తున్నట్లు రాష్ట్రపతి నిలయం అధికారి రజినీ ప్రియ తెలిపారు. గురువారం బేగంపేట యాత్రి నివాస్‌లో టూరిజం బుకింగ్ కౌంటర్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మధ్యాహ్నం 12:15 గంటలకు వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా టీజీటీడీసీ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, టీజీటీడీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.ప్రకాశ్ రెడ్డి హాజరై జెండా ఊపి ఉచిత షటిల్ బస్సు సేవలను ప్రారంభించారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి యాత్రి నివాస్, ప్యారడైజ్ మెట్రోస్టేషన్ నుంచి సాయంత్ర 4 గంటల వరకు ప్రతి గంటకు ఒకసారి షటిల్ బస్సు అందుబాటులో ఉంటుందని రజినీ ప్రియ తెలిపారు.

మొద్దు నిద్ర వీడండి.. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచండి

పారిశుధ్య నిర్వహణలో ప్రభుత్వ తీరును ఎండగట్టిన ఎమ్మెల్యే కేటీఆర్

చర్చనీయాంశమైన 'నమస్తే తెలంగాణ' కథనం

సిటీబ్యూరో, జూలై 25(నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ నగరంలో ఎక్కడ చూసినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వంపై మండిపడ్డారు. చెత్త తరలింపు కేవలం కాగితాల్లోనే మాత్రమే కనిపిస్తుందని, మేయర్, అధికారుల ఆకస్మిక పర్యటనలు లేకపోవడంతో పారిశుధ్య నిర్వహణ గాడితప్పుతుందని విమర్శించారు. గ్రేటర్‌లో పారిశుధ్య నిర్వహణ లోపాలను కేటీఆర్ గురువారం 'ఎక్స్' వేదికగా ఎత్తిచూపారు. సుమారు 1000 స్వచ్ఛ ఆటోలు పనిచేయడం లేదని, బస్తీలు, కాలనీల్లో వ్యర్థాలు పేరుకుపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయని పేర్కొన్నారు. డెంగీ, మలేరియా, అతిసారం వంటి సీజనల్ వ్యాధులతో ప్రజలు అవస్థలు పడుతున్నారని మండిపడ్డారు. పర్యవేక్షించాల్సిన పార్ట్‌టైం మున్సిపల్ మంత్రి ఎమ్మెల్యేల కొనుగోళ్లు, ఢిల్లీలో చక్కర్లలో బిజీగా ఉన్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలని, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, పౌరుల ఆరోగ్యాలు కాపాడాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కాగా, గ్రేటర్ పారిశుధ్య నిర్వహణలో అధికారుల వైఫల్యాలను ఎత్తిచూపుతూ గురువారం 'నమస్తే తెలంగాణ'లో 'ఖర్చు ఘనం-చెత్త పదిలం' అనే శీర్షికన ప్రచురితమైన కథనం అన్ని వర్గాల ప్రజల్లో చర్చనీయాంశమైంది. సోషల్ మీడియా వేదికగా పలువురు పౌరులు చెత్త డంపింగ్ ఫొటోలను పెట్టి జీహెచ్ ఎంసీ పనితీరును ప్రశ్నించారు.

దాశరథి సాహిత్యాన్ని విద్యార్థుల్లోకి తీసుకెళ్లాలి

దాశరథి సాహిత్య సభలో పాల్గొన్న ఆచార్య ఎస్.వి సత్యనారాయణ, నాశేశ్వరం శంకరం, డా.నామోజు బాలాచారి

రవీంద్రభారతి, జూలై 25 : సాహిత్య అకాడమీ లక్ష్యాన్ని చెబుతూ దాశరథి సాహిత్యాన్ని విద్యార్థుల్లోకి తీసుకెళ్లాలనే ఉద్దేశంతోనే విశ్వవిద్యాలయాల్లో సభలు ఏర్పాటు చేస్తున్నామని సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ నామోజు బాలాచారి అన్నారు. గురువారం హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో దాశరథి కవిత్వంపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య ఎస్‌వీ సత్యనారాయణ మాట్లాడుతూ.. స్థానికం నుంచి అంతర్జాతీయం దాకా దాశరథి ప్రయాణం కొనసాగించారని అన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ దాశరథి శత జయంతి సందర్భంగా సాహిత్య అకాడమీ దాశరథి సాహిత్య సమాలోచన వివిధ విశ్వవిద్యాలయాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు ఆచార్య పిల్లలమర్రి రాములు అధ్యక్షత వహిస్తూ దాశరథి పాటలు పద్యాల అంతర్యాన్ని వివరిస్తూ, ప్రేక్షకులను రంజింపజేశారు. విశ్వవిద్యాలయ ఆచార్యులు డాక్టర్ భుజంగరెడ్డి, డాక్టర్ వి.త్రివేణి, వారిజారాణి, నాశేశ్వరం శంకరం తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు న్యాయం చేసేలా ఒత్తిడి తేవాలి

ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి ఆటో యూనియన్ వినతి

సిటీబ్యూరో, జూలై 25(నమస్తే తెలంగాణ): ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంతో ఉపాధి కోల్పోయి రోడ్డునపడ్డ ఆటో డ్రైవర్లను ఆదుకునేలా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరుతూ బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబు యాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని గురువారం కలిసి వినతిపత్రం అందించారు. మహాలక్ష్మి పథకంతో నష్టపోయిన ఆటోడ్రైవర్లకు ప్రభుత్వం ఏటా రూ.12వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చిందని, అది ఇంకా కార్యరూపం దాల్చలేదన్నారు. ప్రభుత్వం అనుమతిలేని ఓలా, ఊబర్, ర్యాపిడో బైకులను రద్దు చేసేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు పూలే నిరంజన్, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టీ-యాప్ ఫోలియోతో 59 సేవలు

సోషియో ఎకనామిక్ ఔట్‌లుక్‌లో వెల్లడి

కేసీఆర్ ప్రభుత్వంలోనే ప్రారంభమైన టీ-యాప్ ఫోలియో సేవలు

సిటీబ్యూరో, జూలై 25(నమస్తే తెలంగాణ) : రవాణా శాఖలో సాంకేతికతకు పెద్దపీట వేస్తూ వినూత్న సేవలు అందిస్తున్నట్లు ప్రభుత్వం గురువారం విడుదల చేసిన సోషియో ఎకానమిక్ ఔట్‌లుక్‌లో పేర్కొంది. టీ-యాప్ ఫోలియో మొబైల్ ఆప్ సేవలను ప్రత్యేకంగా ప్రస్తావించింది. ఎనీవేర్ ఎనీ టైమ్ ఆన్‌లైన్ సర్వీసెసెతో ఆర్టీఏ సేవలను వాహనదారులకు అందిస్తున్నట్లు తెలిపింది. కాగా, ఈ టీ-యాప్ ఫోలియో మొబైల్ ఆప్‌ను కేసీఆర్ ప్రభుత్వం తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఆర్టీఏలో పారదర్శకతకు పెద్దపీట వేసేందుకు, దళారుల ఆగడాలకు చెక్ పెట్టడానికి కేసీఆర్ ప్రభుత్వంలో సాంకేతిక సేవలను తీసుకొచ్చారు. ఈ సేవతో వాహనదారులు కార్యాలయాలకు రాకుండానే సేవలు పొందే వీలు కల్పించారు. ఆర్టీఏలో తీసుకొచ్చిన సేవలపై వాహనదారులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ యాప్ సేవలు సమర్థవంతంగా ఉన్నట్టు కాంగ్రెస్ ప్రభుత్వం సోషియో ఎకానమిక్ ఔట్‌లుక్‌లో వెల్లడించడం విశేషం. కాగా, ఈ యాప్‌తో డూప్లికేట్, లెర్నర్, డ్రైవింగ్ హిస్టరీ, పర్మిట్స్ తదితర సేవలు పొందవచ్చు.

జీఆర్‌టీ జ్యువెల్లర్స్‌లో ఆషాఢం ఆఫర్స్

జూబ్లీహిల్స్, జూలై 25 : కష్టమర్ల ఆనందాన్ని రెట్టింపు చేసేందుకు జీఆర్‌టీ జ్యువెల్లర్స్‌లో ప్రతి కొనుగోలుపై నిర్ధారిత బహుమతి ఇవ్వనున్నట్లు జీఆర్‌టీ మేనేజింగ్ డైరెక్టర్ 'ఆనంద్' అనంత పద్మనాభన్, జీఆర్.రాధాకృష్ణన్ తెలిపారు. కొనుగోలు విలువ పెరిగే కొద్దీ నిబంధనలు, షరతులననుసరించి బహుమతులు పెరుగుతాయని పేర్కొన్నారు. ఆషాఢం ఆఫర్స్‌లో భాగంగా పాత బంగారు ఆభరణాలు మార్చుకునే కష్టమర్లు గ్రాముకు రూ.50 అదనంగా అందుకుంటారని వెల్లడించారు. ఆషాఢ మాసంలో కుటుంబాలుగా షాపింగ్ చేసిన వారికి బహుమతులతో ఆనందాన్ని పంచనున్నట్లు తెలిపారు.

లాల్ దర్వాజ బోనాల ఏర్పాట్లపై పరిశీలన

సిటీబ్యూరో, జూలై 25(నమస్తే తెలంగాణ): ఓల్డ్‌సిటీ లాలాదర్వాజ బోనాల సందర్భంగా శ్రీసింహవాహిని మహంకాళి ఆలయం వద్ద ఏర్పాట్లను దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిలతో కలిసి నగర పోలీసు అదనపు కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్ పరిశీలించారు. బోనాల సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లను అదనపు సీపీ దేవాదాయ శాఖ అధికారులతో చర్చించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ట్రాఫిక్‌కు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులు సమీక్షించారు. సౌత్‌జోన్ డీసీపీ స్నేహా మెహ్రా, ట్రాఫిక్ డీసీపీ వెంకటేశ్వర్లుతోపాటు ఎండోమెంట్ కమిషనర్ హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకే శిక్షణ

జూబ్లీహిల్స్, జూలై 25: విద్యార్థులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు పీఎం కేవీవై శిక్షణ ఉపకరిస్తుందని భాస్కర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుమగ్న పట్నాయక్ పేర్కొన్నారు. గురువారం భాస్కర్ ఇంజినీరింగ్ కళాశాల క్యాంపస్‌లో జేబి గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ సొసైటీతో కలిసి జేఎన్‌టీయూహెచ్ అనుబంధంగా విద్యార్థులను భవిష్యత్ ఇంజినీర్లుగా తీర్చిదిద్దేందుకు పీఎం వికాస్ యోజన పథకాన్ని ప్రారంభించారు. నైపుణ్య శిక్షణను అభ్యసించేలా విద్యార్థులను ప్రోత్సహించడంలో పీఎం వికాస్ యోజన ఉపకరిస్తుందని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డీఎస్‌టి సాయి కిశోర్, జేబీఈఎస్ డైరెక్టర్ ప్రొఫెసర్ సంజయ్ పేర్కొన్నారు. ఇది ఉపాధి పెంపొందించేందుకే కాక వ్యవస్థాపకత, సామర్థ్యాల పెంపునకు దోహదపడుతుందన్నారు.

సైలెంట్ డీహైడ్రేషన్‌తో కిడ్నీలకు ప్రమాదం

క్రమం తప్పకుండా ఎలక్ట్రోలైట్స్ తీసుకోవాలి

గాంధీ మెడికల్ కాలేజీ మాజీ ప్రొఫెసర్ డాక్టర్ సురేశ్‌కుమార్

అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సురేశ్‌కుమార్

ఖైరతాబాద్, జూలై 25: సైలెంట్ డీహైడ్రేషన్ అనేది ప్రమాదకరంగా మారిందని, శరీరంలో మనకు తెలియకుండానే ఎలక్ట్రోలైట్స్ పడిపోవడం వల్ల కిడ్నీలు ఫెయిల్ అవుతున్నాయని గాంధీ మెడికల్ కళాశాల మాజీ ప్రొఫెసర్ డాక్టర్ సురేశ్‌కుమార్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్ఎల్ శ్రీధర్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. సైలెంట్ డీహైడ్రేషన్‌ను గుర్తించడం ముఖ్యమని, అది తీవ్రరూపం దాల్చే వరకు లక్షణాలు బయటకు కనిపించవన్నారు. ప్రధానంగా ఎలక్ట్రోలైట్స్ పడిపోతాయని, అవి నరాలు, కండరాల పనితీరును నియంత్రించడంలో సహాయ పడుతాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక మంది సైలెంట్ డీహైడ్రేషన్ ద్వారా మూత్రపిండాలు విఫలమై చనిపోయారని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన ఓఆర్ఎస్‌ను తీసుకోవడంతో పాటు పచ్చని కూరగాయలు, ఇతర పండ్లు, వాటి రసాలు తీసుకోవాలని, సమతుల్యంగా నీటిని తాగాలన్నారు.

హైటెక్‌సిటీ మార్గంలో ..

రాయదుర్గం మెట్రో మార్గంలో ..

బయోడైవర్సిటీ మార్గంలో..

మల్కంచెరువు మార్గంలో భారీగా నిలిచిపోయిన వాహనాలు

స్తంభించిన ట్రాఫిక్

నగరంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రోడ్లన్నీ అధ్వానంగా మారాయి. దీనికితోడు ప్రజా రవాణా వ్యవస్థ అందుబాటులో లేకపోవడంతో ప్రజలు సొంత వాహనాలపై ఆధారపడాల్సి వస్తోంది. దీంతో నగరంలోని రహదారులన్నీ సాయంత్రమైతే చాలు కిక్కిరిసిపోతున్నాయి.

బయోడైవర్సిటీ ఫ్లైఓవర్ కింది మార్గంలో..

'బ్రెయిన్ వెంచర్స్' హాస్య నవల ఆవిష్కరణ

అమెరికాలోని తెలుగు అమ్మాయి గోలి అంజన మెదడు పనితీరుపై హాస్యభరితంగా నవల రాయడం అభినందనీయమని త్యాగరాయగానసభ అధ్యక్షుడు కళా వీఎస్.జనార్దనమూర్తి అన్నారు. గురువారం చిక్కడపల్లిలోని శ్రీత్యాగారాయగాన సభలో గోలి అంజన రచించిన 'బ్రెయిన్ వెంచర్స్' అనే పుస్తకాన్ని హాస్యబ్రహ్మ శంకరనారాయణతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్న వయసులోనే మంచి రచయిత్రిగా పేరు సంపాదించడం విశేషమన్నారు. కార్యక్రమంలో రచయిత రాయారావు విశ్వేశ్వరరావు, గాయకుడు వడ్లకొండ వెంకటరావు తదితరలు పాల్గొన్నారు.

– చిక్కడపల్లి, జూలై 25